

బొమ్మలరాణి

అడివి బాపిరాజు

ప్రథమభాగం

౧

ఆ రాత్రి తోలుబొమ్మలాట. ఎనిమిదిగంటలయ్యేటప్పటికి పందిరి తయారయింది. ఊళ్లో బట్టలషావుకార్లు తటవర్తివారి నడిగి ఒకఅరతాను కోరామల్లు పట్టుకువచ్చి తెరకట్టారు. తెరఅడుగున గట్టితడకలు గట్టారు. ఆరుపెద్దమండిగల్లో శేరుశేరు ఆముదం పోసి ఇనపకొంకెలలో పెట్టి తెరవెనకాల వేళ్లాడతీశారు.

తొమ్మిదింటికి ఊళ్లోఉండే పాటకజనులు, కాపులు, హరిజనులు మొదలగు యావన్మందీవచ్చి తోలుబొమ్మల పందిరిముందర కూర్చున్నారు. తెరవెనక దీపాలు వెలిగించారు. వెలిగించడంతోటే తెరమీద రాములవారు, లక్ష్మణస్వామి, హనుమంతుడు, జాంబవంతుడు, సుషేణుడు ఇంకామూడుకోతులు ఈపక్కా ఆపక్కా చెట్లు కాక గూనిమిది విగ్రహాలున్నాయి.

దీపాలు వెలిగించడంతోటే "తొండము నేకదంతమును" అనే పద్యం చక్కనిగొంతుకతో తెరఅవతల ఒకవృద్ధకంఠం ఆలాపించింది. ఒకవానరుని బొమ్మతీసి ఆప్రదేశంలో నాలుగుతాళాలు, మద్దెల, తాగాశ్రుతిలో, మూడోకాలంలో, చతుష్కళలో "విఘ్నరాజా సిద్ధివినాయకా" అంటూ నాటరాగంలో, ఏడుగొంతుకలు లయగా కలిసి, హంగుచేస్తూ ఉండగా విఘ్నేశ్వరునిబొమ్మ ప్రవేశపెట్టించారు. 'తైతకధిమికిట' అని ఆవినాయకుడు తాండవించి పోతున్నాడు. "తాండవనృత్యకర గజానన" సభికుల హృదయాలు ఝల్లుమన్నాయి. పాట అయిపోయింది. వెనకటి శ్రావ్యమైన వృద్ధకంఠము

"వినాయకో విఘ్నరాజో ద్వైమాతుర గణాధిపాః,
అప్యేకదంత హేరంబ లంబోదర గజాననాః.
ఇత్యమరః."

శ్లో. "శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజం,
ప్రసన్నవదనం ధ్యాయే త్సర్వవిఘ్నోపశాంతయే."

"అని యీలాగున ఈరోజున మేము ఆడబోయేటటువంటి శ్రీమద్రామాయణంలో రామరావణాయుద్ధం, శ్రీరామపట్టాభిషేకం అనే ఆట ప్రారంభించేముందు విఘ్నేశ్వరుని ప్రార్థించిన వారమగుచు ఇంక చదువులుతల్లియైన సరస్వతీదేవిని ప్రత్యక్షం జేసుకుంటున్నాము. "వీణా పుస్తకపాణి......" అనే శ్లోకంపాడి విఘ్నేశ్వరుని విగ్రహాన్ని తీసి సరస్వతీదేవి విగ్రహాన్ని ప్రవేశపెట్టారు. ఆమెను లాస్యగతిని నాట్యమాడించారు. చక్కనిపాట పాడారు. భాగవతాది గ్రంథాలలో ఉన్న సరస్వతీమీద పద్యాలన్నీ చదివారు. సరస్వతీదేవి పటమున్నూ మాయమైంది. మళ్లీ వెనకటి వానర విగ్రహంవచ్చింది.

ఈగుంపు చాల విద్వత్తుకలగుంపు. గుంపుపెద్ద వీరయ్య డెబ్బదియేళ్లవాడైనా కంఠం గంభీరమంద్రంలో మంద్రంలో తెల్లటి జీడిపాకంలా మాతియ్యగా సాగుతుంది. మంచివిద్యావంతుడు. వాల్మీకి రామాయణం, భాస్కరరామాయణం, సంస్కృత మహాభారతం, నన్నయ తిక్కన ఎఱ్ఱాప్రెగ్గడల మహాభారతం ఆతని కంఠస్థం, మంచినీళ్లపోకడ. అమరం అనర్గళధార. ఒక్కొక్క కథకు నాలుగైదు తోలుబొమ్మ యక్షగానాలు అద్భుతంగా వచ్చును. సంగీతశాస్త్రం ప్రసిద్ధికెక్కిన కోన సుబ్రహ్మణ్యశాస్త్రిగారి దగ్గిర నిరాఘాటంగా నేర్చుకున్నాడు.

ఆతనికుమారుడు విఠలుడూ, విఠలుని ఇద్దరుభార్యలు నాంచారి, రుక్మిణీన్ని, విఠలుడుకొడుకు ఓబలయ్యా, వాడి తమ్ముడు బేట్రయ్యా, విఠలుని కూతురు మీనాక్షి- ఈఏడుగురు ఆటలో పాలుపుచ్చుకునే జట్టు. తోలుబొమ్మలవాళ్ల ఆచారంప్రకారం మొగవాళ్లు, ఆడవాళ్లూ మద్దెలవాయించడం, తిత్తిఊదడం నేర్చుకోవాలి.

వీరయ్యకు గొంతు తొణకనన్నా తొణకదు. వీరయ్య కుమారునకీ, మనమలకీ, కోడళ్లకీ, మనమరాలికీ బొమ్మలు తయారుచేయ

డం వచ్చును. వీరయ్య తోలుబొమ్మలవాళ్లందరిలోను శిల్ప సార్వభౌముడు. వెంకటగిరిసంస్థానంలోను, కార్వేటినగర సంస్థానంలోను, గద్వాలు సంస్థానంలోను వీరయ్యకు మూడు బంగారపు కడియాలు బహుమతులు వచ్చాయి. విజయనగరంమహారాజాగారు నూటపదైరూపాయల శాలువనూ, నూటపదహారురూపాయలు రొఖ్ఖమునూ బహుమతీ యిచ్చారు. నూజివీడు కోటలో వెండిజరీ పగిడీ, మెళ్లో అయిదుకాసుల కంఠహారం, దోసెడు రూపాయలు, ఒక ఎకరం యీనాము ఇచ్చారు.

౨

పూర్వకాలంలో వీరయ్య సంపాదన దోసిళ్లకొద్దీ ఉండేది. సత్తెనపల్లిలో పదియెకరాల మాగాణీభూమి కొనుక్కున్నాడు. అయిదారుచోట్ల నాలుగువేలరూపాయలు వడ్డీవ్యాపారానికి వేసుకున్నాడు. నేడు తోలుబొమ్మల్ని ఆదరించేవాళ్లు లేరు. మారీఫిక్‌ఫర్డు, గ్రెటాగార్బో, నార్మాషీయరరు, డగ్లాసు మొదలుగువాళ్లు గమ్మత్తులు చేసే యీరోజుల్లో తోలుబొమ్మలను ఆదరించేవాళ్లెవరు? ఐనా నాగరకత యింకా పూర్తిగా పాటకజనాల్ని ఆవహించలేదు. వాళ్లని సరస్వతీమాత రక్షించాలి. తోలుబొమ్మలు చూసినా, యక్షగానాల్ని ఆదరించినా, బుర్రకథలవాళ్లని, దేవరకథలవాళ్లని, వీధి భాగవతుల్ని వీళ్లని రక్షించేప్రభువులు వాళ్లేయింక.

వీరయ్యజట్టంటే ఇప్పటికి పూర్వకాలపు వాసనలు పూర్తిగా పోని విద్యావంతులకూ గౌరవమే. ఈరోజున కొంచెం ప్రొద్దుపోయినా పదిగంటలకు ఊళ్లోవర్తకులు, కరణాలు, పండితులు, ఓవరిసీయరు, స్కూళ్ళయినస్పెక్టరు, రెవిన్యూ యినస్పెక్టరు మొదలగు ఉద్యోగులు, ఏమీచేయకుండా ఊళ్లోకూచొనియున్న కామేశ్వరరావు యం. ఏ. గారూ, యావన్మందీ వచ్చి వాళ్లకు వీలుగా ఏర్పరచిన పెద్దకాపుగారి పెద్దరుగులమీద కూర్చున్నారు. చాపలమీద దిండ్లూ, పరుపులూ, తివాసీలూ అన్నీ వేయించాడు. కామేశ్వరరావు ఎం. ఏ., పెద్దకాపు దగ్గిరచుట్టం.

హనుమంతుడితోటి రాములవారు సుగ్రీవుణ్ణి తీసుకురావలసినదిగా ఆజ్ఞాపిస్తున్నారు. రాములవారు కుడిచేతినిమాత్రం కదుపుతున్నారు. "అయితే, ఓయిమిత్రుడా, హనుమంతుడా"

"అవును స్వామీ ఊహుఁ."

"కపి, ప్లవంగ, ప్లవగ, శాఖామృగ, వలీముఖాః,
మర్కటో, వానరః కీశో వనౌకాః, ఇత్యమరః.

అట్టిమర్కటశ్రేష్ఠుడై, ఉత్తముడైన సుగ్రీవుడు,
"చిత్తం రాఘవేంద్రా, శ్రీరామచంద్రా"

"హనుమంతా ఎందుకు నాకు ఆసుగ్రీవుడు కనబడుతున్నాడవుకుంటూ ఉండలేదేమోయి?"

"ఓహో రామచంద్రా దశరథపుత్రా, నేను తప్పకుండా సుగ్రీవమహారాజు ఏమిచేస్తున్నాడో చూసివస్తున్నాను రాఘవేంద్రా"

హనుమంతుడు దేహమంతా కదుపుతూ శిరస్సు శ్రీరామచంద్రుని పాదాలకడ ఉంచుతూ ఆడిపోతున్నాడు. ఓపక్కన ఉన్నబొమ్మలుతీసేసి, అక్కడ సుగ్రీవుడు తారాదేవి ఇద్దరు చెలికత్తెలు విగ్రహాల్ని ప్రవేశపెట్టారు. సుగ్రీవుడు తారాదేవితో నర్మసంభాషణలు చేస్తున్నాడు. ఇంతలో తారాదేవి భర్తకు జవాబు చెపుతూ ఒకపాట యెత్తుకుంది. ఆగొంతుక కిన్నరీమాధుర్యము, సమ్మోహనపూరితము, కాకలీమృదులోలితము.

ఆపాట వింటూనే సభంతా నిశ్శబ్దం అయిపోయింది. పండితపామరుల యావన్మంది హృదయాలూ ఆనందంచే ద్రవించిపోయాయి. ఆగానప్రవాహము సుళ్లుచుట్టి సెలయేళ్లయిప్రవహించింది.

పెద్దకాపుగారి అరుగుమీద గోడకుజార్లాబడి, ఒయ్యారంగా పడుకుని సిగరెట్టు కాల్చుకుంటూ యేదో ఆలోచిస్తూన్న కామేశ్వరావు గబుక్కునలేచి కూచుని బొమ్మలతెరవంక చూసాడు. ఏమిటా ఆగొంతుక? అని అనుకున్నాడు. వింటూన్నట్టు విననట్టూ, కునికినట్టు కునకనట్టూ కూచునిఉన్న గాయకశ్రేష్ఠుడు సీతారామయ్యగారు ఉలిక్కిపడి, అతిశ్రద్ధతో పాట ఆలకించడం మొదలెట్టాడు. ఆకంఠము అతితియ్యటిది. శారీరములో గంభీరత ఉంది. స్వాధీనకంఠము. శ్రమలేదు యెత్తుగడలో, గమకంలో ప్రకృతిజనితమైన వైచిత్ర్యముంది. ఆబాలిక వీరయ్య కేమవుతుందో అనుకున్నాడు సీతారామయ్యగారు.

౩

గాయకశ్రేష్ఠుడు సంగీతశాస్త్రపండితోత్తముడు సీతారామయ్యగారు. భీమవరంలో తోలుబొమ్మలాటైన వారంరోజుల వెనక ఓసాయంత్రం ఇంట్లోకూచొని ఫిడేలు వాయించుకుంటున్నాడు. తనఫిడేలుపాట శ్రుతికాగా వీధిలో త్రోలుతిత్తిశ్రుతిలో పంచమస్వరంలో చక్కనిపాట విన్నాడు. ఆయన ఫిడేలును క్రిందనుంచి, అచ్చట ఒకబాలికయున్నూ, ఒకపెద్ద ఆడమనిషిన్ని ముష్టికోసం వచ్చిఉండుట చూచాడు. పధ్నాలుగేళ్లు యీడువున్న ఆబాలిక గాత్రంతో పాడుతున్నది. నడిమివయస్సుగలస్త్రీ శ్రుతికోసం తిత్తి ఊదుచున్నది. సీతారామయ్యగారు మొన్న తోలుబొమ్మలాటలో తాను ముచ్చటపడుతూ విన్న కంఠమేయిది.

"అమ్మాయీ! నీకు వీరయ్య ఏమౌతాడు?"

"మాతాతయ్యండి."

"ఈమని ఎవరు?"

"మా అమ్మండి."

"నీకు సంగీతం ఎవరు నేర్పారు"?

"మా తాతయ్య నేర్పాడుసామీ."

"నీకు సంగీతం నేర్పితే నేర్చుకుంటావూ?"

తల్లి—"సామీ అంత అదృష్టం మాకు పడుతుందాడీ?"

"అదృష్టానికేముందిలే. ఇటువంటి కంఠానికి క్రమమైన సాధన లేకపోవడంవల్ల దోహదం లేని పూలచెట్టులా ఉంటుంది. ఇలాంటి గొంతుకే నాచేతిలో పడితే, దీనిముందర కిన్నెరుల పాటలున్నూ, మహతీవీణయున్నూ కూడా అపశ్రుతిస్వరాలు పలకొద్దూ. దీని కీగళ మెక్కడనుం చొచ్చిందీ?"

"మాతల్లి గొంతు కింతకన్న అందంగా ఉండేదండి"అని నడిమి వయస్సుస్త్రీ బదులు చెప్పింది.

"నేను వీరయ్యతో మాట్లాడుతాను. అతన్ని ఒకసారి రేప్రొద్దున్న మా ఇంటికి పంపించు."

స్త్రీలిద్దరు వెళ్లిపోయారు. సీతారామయ్యగారి కామాధుర్యమైన గొంతుక ఆరోజల్లా వినబడుతోనే ఉంది.

మఱునాడుదయమే వీరయ్య, విశలుదూ వచ్చారు. వీరయ్య ఎదటివాళ్లను గౌరవంజేస్తూ తనకు గౌరవం తెచ్చుకునేరకం. ప్రపంచకం యొక్క దాతృత్వంమీదే తాను ఆధారంపడిఉన్నప్పటికీ, వీరయ్య ఎప్పుడూ భట్రాజుకాదు. సీతారామయ్యగారివంటి పండితోత్తముడు, సజ్జనుడు, ఉత్తమగాయనుడు తన మనుమరాలికి సంగీతం నేర్పడంకన్న అదృష్టం ఇంకోటి లేదని తెలుసును. అయినప్పటికీ ఈరోజుల్లో తనకువచ్చే ఆకొద్దిరాబడీ తన మనుమరాలి గొంతుకవల్ల వస్తోంది. ఆగొంతుకు వినబడకపోతే ఏవూళ్లోనూ అయిదు రూపాయిలకన్న ఎక్కువ దొరకవాయను. సంగీతం నేర్చుకుంటే వచ్చే లాభం ఏమిటి? ఆటలికి ఎక్కువడబ్బు వస్తుందా? లేకపోతే తాను తనమనుమరాలిని పెట్టుకొని సభలుచేయిస్తాడా? పైగా పిల్లకి గర్వంహెచ్చిపోయి తరతరాలనించీ వస్తూయున్న ఈపవిత్రమైన వృత్తిని భీమవరం మురికికాలువలోనో, నర్సాపురం గోదావరిలోనో కలిపేస్తే!

"స్వామీ, తమరు శలవిచ్చింది ఎంతోసంతోషమైంది. కాని ఏమిచేసేది? వృత్తివాండ్లం. జట్టు కొద్దిమందే ఉంటిమి. ఈకరువు దినాలల్లో మారాబడి అంతా ఈపిల్లదాని గొంతుకుపైనే ఆధారము పడిఉంది సామీ?

"ఓయి శెట్టివాడా, ఇప్పుడు కొంచెం కాలం మళ్లుతోంది బోయ్. తోలుబొమ్మలు వీధినాటకాలు మళ్లీ దేశంలో ఉద్ధరింపబడతాయి. నాగరికత కలవాళ్లే వీట్లను ఉద్ధరిస్తారు. అల్లాంటప్పుడు నీకూతురు సంగీతంనేర్చుకుని ఉందంటే నీజట్టుకు వచ్చేగౌరవం ఇంతాఅంతా అనికాదు."

వీరయ్య—అదేమిటి సామీ, వీధినాటకాలు మూలబడ్డాయి. కూచిపూడిబాగవతులు కూలిపోయారు. విప్రవినోదులు అయిపులేరు. చినీమాలు, నాటకాలు మఱి అదేంటిసామీ, ఏమిట్రా అబ్బాయి దానిపేరు, విప్రవినోదులు చేసేపనులు చేస్తారు?

సీతా—ఓ! మాజిక్కా!

వీర—అదో అదండి. అల్లాంటివన్నీ పెరిగిపొయ్యాయి.

సీతా—ఓయిపిచ్చివాడా, పోనీ తోలుబొమ్మలు చచ్చిపోతాయే అనుకో. ఈరోజుల్లో సంగీతం నేర్చుకున్నవాళ్లకి డబ్బెక్కువ. సంగీతసభలు, సంగీతస్కూలు మేష్టర్లు, సంగీత గ్రామఫోనుప్లేట్లు, సంగీతసినీమాలు ఆడవాళ్లు నాటకాల్లో వేషాలు వేయడం, ఎక్కడజూసినా సంగీతానికే యీరోజుల్లో డబ్బు. అల్లాంటప్పుడు కాస్త గట్టిగా సంగీతం నేర్చుకుంటే మీకుటుంబము నంతా అదే పోషించగలదు. గౌరవముసంగతి చెప్పక్కర్నే లేదు. యేమంటా వోయ్ విశలయ్యా?

విశ—నిజం, సామీ! మా అప్ప ముసలివాడు. వాడికేమి తెలుసు మాఅమ్మణ్ణి మీదగ్గర ఉంచుగురు సామీ.

వీరయ్య తలఊపుతూనే ఉన్నాడు.

తానే తిండిపెడుతూ కన్నకూతురులా పోషింపుతూ ఉదారహృదయుడు, సత్స్వభావసంపన్నుడు సీతారామయ్యగారు మీనాక్షికి సంగీతం నేర్పుతున్నాడు.

౪

కామేశ్వర్రావు యమ్. ఎ. గారికి సాలుకు వెయ్యిరూపాయిలు వచ్చే ఆదాయం ఉంది. ఏఉద్యోగానికైనా ప్రయత్నించాలని ఉంది. కాని ఇంటిదగ్గర తల్లితో ఒక తమ్ముడితో సంసారము పొదుపుగ కాలక్షేపం చేసుకుంటున్నాడు. ఉద్యోగాలకి దరకాస్తులు పెట్టడం, ఉద్యోగాలకోసం తిరగడం, ఉద్యోగాలకోసం ప్రాధేయపడ్డం అతగాడు యెంతమాత్రం సహించలేకపోయాడు. కాంగ్రెసు అంటె అభిమానం. సాధ్యమైనంతవరకు స్వదేశీవస్తువులే కొంటూయుంటాడు.

కామేశ్వర్రావు రసపిపాసి అవడంచేత కళాహృదయానికి సంపూర్ణంగా వ్యతిరేకమైనటువంటి 'సేవ' అనేపదార్థము ఆతనికియెల్లా ఆవేశం కలగజేస్తుంది? ఆతని మనఃపథాలల్లో గ్రాయరుబల్ల, ప్రక్కని కాగితాలపెట్టి, బీరువా, కాగితాలకట్ట దొంతరలు ఇవి చిత్రలేఖానికి శిల్పానికిన్ని వ్యతిరేకమైన అడ్డుగీత లని అనుకుంటాడు.

"ఆకాగితాలు యెందుకు పంపించవు? ఈ విషయంమీద నోటు పంపించవేమీ?" అనేరకాలైన మాటలు గాంధర్వ మహాకళకు అపశ్రుతులని తలుస్తాడు.

పైవారికి కిందవారికి పంపించే విజ్ఞాపనలు తాఖీదులు కవిత్వం అవుతాయా అని పృచ్ఛ చేసుకుంటాడు.

ఏలాగున ఆతడు ఉద్యోగాలకి ప్రయత్నించగలడు?

కామేశ్వర్రావుకు సంగీతమంటే పరమప్రాణం. కవిత్వమంటే చెవికోసుకుంటాడు. చిత్రలేఖనం, శిల్పం చూసి మురిసిపోతాడు. కళారసజ్ఞుడు. కాని ఒక్కకళలోను ప్రవేశం లేదు. గొంతుక కొంచెం బాగుంటుంది. అంచేత దేవులపల్లివారి దేవాలయందగ్గిరికీ, నండూరి వారి నాయుడుగ్రామానికీ, చింతావారి పుణ్యక్షేత్రానికి, కవికొండల వారి వికసితోత్పలదగ్గిరికి, విశ్వనాథంవారి కిన్నెరవాగులకి, ముద్దుకృష్ణుని మురళీజ్వాలలదగ్గిరికి తీర్థయాత్రలు సేవిస్తూ వరుసలు నేర్చుకుంటూ వస్తూఉంటాడు. గ్రామఫోనులలో పాటలు చాలాబాగా వచ్చును. స్థానంవారి స్థాయీ మార్పువిలాసాలకు మురిసిపోతాడు. అద్దంకివారి ముద్దుగొంతుక, కపిలవాయివారి గంగాప్రవాహం, జొన్నవిత్తులవారి కిన్నెరకంఠానికి, సి. యస్. వారి చిన్నారి పొన్నారిపాటలకు, తుంగలవారి గమకభంగిమాలకు బాలగంధర్వుని పరమగాంధర్వానికి, రావు వ్యాసుని జీవగీతాలకు, పెండేర్కర్ ఉద్దండ సంగీతానికి మురిసిపోయి సొక్కి కన్నులరమూతలేసి ఆనందంలో ఊగిపొయ్యేవాడు.

కాని సంప్రదాయసిద్ధమైన త్యాగరాయాదుల పాటలు, రాగాలాపనలు, రాగమాలాప్రవాహాలు అంటే అతనికి తలనొప్పి తెప్పించేటంతవరకూ వస్తుంది.

ఆనాడురాత్రి తోలుబొమ్మలాటలో సమ్మోహనాస్త్ర తుల్యమైన ఆబాలికాకంఠం విన్నప్పుడే నెమ్మదిగా ఇంటికిపోయి అయిదు రూపాయిలనోటు పట్టుకొచ్చి తోలుబొమ్మల పందిరివెనక్కి వెళ్లి వీరయ్యని ఈవలకి పిలిచి నీమనవరాలి గొంతుక్కి ఇదుగోరా బహుమానం అని ఇచ్చాడు. ఆతక్షణము వీరయ్య కదఆపుచేసి తెరమీద బొమ్మనెక్కించి 'మరీమరీ కామేశ్వర్రావుగారూ' అని పొగిడాడు. గొప్పప్రభువులకు చూపించే మంచిబొమ్మలు తెరమీద కెక్కించాడు వీరయ్య.

ఆనాటినుంచి కామేశ్వర్రావుకు మీనాక్షికంఠము సర్వకాలము ప్రతిధ్వనిస్తూనే యున్నది.

ఆబాలిక కొంచెము చామనచాయ. నవయౌవనము పరిమళిస్తూఉన్న పొంకాలరేఖలు సుడులుతిరిగి కరిగిపోతూఉన్న విగ్రహము. మోము కోల. వెడల్పు కొంచెముతక్కువైన పోనుకపాటి కన్నులు. చివరకొంచెము వట్రువతిరిగిన ముక్కు. మావిచివుళ్ల పెదవులు. అపశ్రుతిలేని సౌందర్యఖని. ఆబాలమోము కళాకోవిదత్వము స్పష్టీకరిస్తూ యున్నది.

ఇదివరకు యేనాడున్ను కామేశ్వర్రావు ప్రణయావేశుడు కాలేదు. పవిత్రమైన తెలగవారికులంలో పుట్టిన తనకు, ఈనీచంగా సంచరించే బొమ్మలాటవాళ్ల కన్నెపై ఈరోజున ఈప్రణయ ప్రాదుర్భావము యేమిటి? చదువుకుంటూఉన్నాడనిన్ని, ఇంత అన్నవస్త్రాలకి ఇబ్బందిలేకుండా ఉండేసంప్రదాయకుటుంబంలోని పిల్లవాడనిన్ని ఆలోచించి, యెక్కువకట్నంతో, తమబాలికల నిస్తామని అనేకపెద్దకుటుంబాల నాయుళ్లూ, కాపులు వస్తూఉన్నారు. చక్కని, తెలివైన, చదువుకున్న బాలికను చూసి పెళ్లిచేసుకుందామని అనుకుంటున్నాడు. అలాంటితనకు ఈప్రేమ యెక్కడనుంచి ప్రత్యక్షమయిందో!

ఆబాలిక ఈఊళ్లోనే సంగీతము నేర్చుకుంటున్నది. ఆతని హృదయం రాగాలు పాడింది. తానుకూడా సంగీతము నేర్చుకోవాలని చిరకాలంనుంచి ఉన్నదిగా?

మర్నాడు సీతారామయ్యగారిని కలుసుకున్నాడు.

"ఏమండీ, గురువుగారూ, నమస్కారం."

"దీర్ఘాయుష్యమస్తు, వివాహసిద్ధిరస్తు. యేమండీ, కామేశ్వర్రావుగారూ, రెండునెలల్నుంచి నాఫిడేలు వినడానికి రావటం లేదే?"

"ఇదివరకు మీతో అంటూవచ్చాను గాని నా యమ్. ఎ. చదువుకి సంగీతానికి పడదని తమ శిష్యుణ్ణి కాలేదు. నాకు సంగీతం నేర్పడం మీరు మొదలెట్టాలని నామనవి."

"నాకు ప్రస్తుతం అయిదు పెద్దపాఠాలున్నాయండీ. పొద్దున్నరాత్రి ఇంటిదగ్గిరకుఱ్ఱాళ్లకి చెప్పాలి. తక్కిన కాలంలో ఈ అయిదుపాఠాలు సరిపోతాయి. బాబూ, నన్నుక్షమించాలి."

"యెల్లాగో తీరిక చేసుకుని మీయింటిదగ్గిరే నాకు ఆరోపాఠంగా నేర్పాలి. మీరే రెండుమూడుసార్లు నా గొంతుక మంచిది, సంగీతం నేర్చుకోమన్నారు."

"మీబోటివాళ్లు మాఇంటికి రావడమే!"

"నన్ను సంగీతం నేర్చుకోవద్దంటారా?"

"అయ్యయ్యో! యెంతమాటంటారూ! మీబోటి ఉత్తములకు సంగీతం నేర్పకపోతే నావిద్యెందుకండీ!"

"ఇన్నాళ్లూ ఈచదువులతో కాలం వృథాపుచ్చాను. ఈనాటికి నా కీసత్సంకల్పం కలిగింది. సంగీతం విని ఆనందించేందుకైనా నేర్చుకోవాలని ఉంది."

"మీరు మాఇంటికి రావడం నామనస్సు ఒప్పదండీ."

"అయితే, తమరు మాయింటికి తమ ఇష్టమువచ్చినప్పుడు దయచేయొచ్చునే."

"అయిదు పాఠాలు రోజంతా తీసుకుంటున్నాయి."

సీతారామయ్యగారు చిరునవ్వు నవ్వుతున్నాడు.

"మీదీక్ష నాకు సంతోషం కలుగజేస్తున్నదండి."

"నాది ఆరోపాఠం. తమ ఇంటికేవచ్చి నేర్చుకుంటాను. తమ సేవ చెయ్యడానికి నా కీసావకాశం ఇవ్వండి."

"మీరు ఉద్యోగానికి వస్తారా!"

"అసలు ఉద్యోగానికే వెళ్లను. ఒకవేళ వెడితే అంతవరకే చెప్పండి. నాఅదృష్టం అంతే అనుకుంటాను. ఇక అభ్యంతరాలు చెప్పకండి. సంగీతహృదయంలోకి నన్ను చొచ్చి పోనివ్వండి. మిమ్మల్ని వదలను. మీఇంటికివచ్చే నేర్చుకుంటాను. మంచి ముహూర్తం చూసి తమరెప్పుడు రమ్మంటే అప్పటినుంచి తమదగ్గిర శుశ్రూష ప్రారంభిస్తాను" అని కామేశ్వర్రావు చేతులుజోడించినాడు.

"అయ్యయ్యో, అదేమిటి కామేశ్వరరావుగారూ" అని ఆయన కామేశ్వరరావుచేతులు పట్టుకున్నాడు.

౫

కామేశ్వర్రావు మీనాక్షి పాఠం మొదలుపెట్టబోయేముందు వస్తూఉండేవాడు. కామేశ్వర్రావుపాఠం ఏడింటికి మొదలుపెట్టి ఏడున్నరకు సీతారామయ్యగారు పూర్తిజేశేవారు. కామేశ్వర్రావు మహాదీక్షగా నేర్చుకుంటున్నాడు. అంచేతనే అందరికి గంట చెప్పేపద్ధతి తనదగ్గిర అవసరం లేకుండా చేసుకున్నాడు. ఏడున్నరదగ్గిరనుంచి రాత్రి యెనిమిదిన్నరవరకు మీనాక్షికి పాఠం జెప్పేవారు సీతారామయ్యగారు. మీనాక్షిపాఠం అయినతరువాతనే కామేశ్వర్రావు ఇంటికి వెడుతూఉండేవారు. ఇంటిదగ్గిరంతా పరిశ్రమచేయడంవల్ల కామేశ్వర్రావు పరుగులమీద సంగీతవిద్యాదీక్ష పూనాడు. సంగీతశాస్త్రంలోఉండే సిద్ధాంతాలన్నీ కరతలామలక మైపోయాయి. జంటలు, గీతాలు, స్వరజితులు, వర్ణాలు ఆరునెల్లో పూర్తిజేసి కీర్తనలకువచ్చాడు. మీనాక్షి తనతతగారు నేర్పినదంతా మర్చిపోయి మళ్లీనేర్చుకోవలసివచ్చింది. అద్భుతమైనగొంతుక కాబట్టి మూడునెలలలో రాగాలు, కీర్తనలుకూడా ప్రారంభించింది.

మీనాక్షి వికసిస్తూఉన్న పుష్పము. ఆమె ఇంకనూ అందాలు కోసుకొని దండలు గుచ్చుకుంటుంది. ఆమెహృదయము లేడిపిల్లలాంటిది. చిన్నతనాన్నుంచి ఆమెకంఠంలోని గానాద్భుతం చూచి మురిసిపోయే తాతగారు ఆమెకు చక్కని సంబంధం వెతికి మనమణ్ణితెచ్చుకొని ఇల్లరికం ఉంచుకోవాలని ఉవ్విళ్లూరుతోఉండేవాడు.

మీనాక్షి కామేశ్వర్రావు ఎందుకంత తనతో చనవుచేసుకొంటున్నాడో దానివిషయమై ఆలోచనైనా కలగలేదు. కామేశ్వర్రావును చూస్తే ఆమెకు చాలాసంతోషంగాఉండేది. ఎప్పుడు అతనితో ప్రాణమిచ్చి మాట్లాడేది. జట్టుతోపాటు ఆమె యెన్ని ఊళ్లు తిరిగినా ప్రపంచజ్ఞానములోని ఓనమాలన్నా ఎరగదు. అంచేత కామేశ్వర్రావు రైళ్లనుగురించి, విమానాలనుగురించి, సినీమాలనుగురించి, విద్యుచ్ఛక్తిదీపాలనుగురించి, దేశాలు, దేశాలలోని ప్రజలు, పంటలు, నగలు, దుస్తులు మొదలైనవాటినిగురించి నోరూరగా చెబుతూఉంటే విస్తుపోయి వింటూఉండేది.

మీనాక్షి సీతారామయ్యగారింట్లోనే భోజనంచేసేది. ఆయన తనకోసం అని ఇచ్చిన వీథిగదిలో సామాను పెట్టుకుని అక్కడనే పడుకునేది. కామేశ్వర్రావు స్నేహముచేత శుభ్రత, ఆరోగ్యము, రసజ్ఞత వీటినిగురించి మీనాక్షి బాగానేర్చుకొన్నది. ఎరకలవాళ్ల పందిలదొడ్డిలా వుండే మీనాక్షిగది నెమ్మది నెమ్మదిగా మార్పుచెంది ఆరునెలలలో కళాప్రదర్శనపుమందిరములా తయారైనది. మోడరన్ రివ్యూ, భారతి, గృహలక్ష్మి మొదలైన పత్రికల్లోంచి కామేశ్వరరావు సంగ్రహించిన బొమ్మలు అద్దాలుకట్టించి గోడలమీద వేలాడగట్టుకుంది. జపాన్ వెదురుఅల్లిక తెరలు అక్కడక్కడ అలంకరింపబడియున్నాయి.

ఇంతలో సీతారామయ్యగారి పెద్దకూతురు పుట్టింటికి పండక్కని చక్కావచ్చింది. ఆఅమ్మాయిఅత్తవారు కాకినాడ. అత్తవారు మంచి నాగరికతగల కుటుంబ మగుటచేత అతినవీన నాగరికతా సంప్రదాయంలో ప్రథమతరగతిలో ప్రథమముగా ఉంటూన్న వాళ్లలో ఒకర్తె. మనదేశంలో భర్తకు యేదియిష్టంగా యుంటే అలాగమారిపోతారుగా ఆడవాళ్లు. సీతారామయ్యగారు పెట్టినపేరు విస్సమ్మ. నేడు విజయానందని.

గోదావరివరదలా యింట్లోకి చక్కావచ్చింది.

"అమ్మా, వీథిగదిలో నుంచున్న అమ్మాయియెవరే?"

"నాన్నగారిదగ్గిర సంగీతం నేర్చుకుంటూయున్న ఒక బొమ్మలాళ్లమ్మాయి."

"బొమ్మలాళ్లేమిటేవు?"

"తోలుబొమ్మలాళ్లే."

"తోలుబొమ్మలాళ్లకి సంగీతం ఏమిటి?"

"ఆఅమ్మాయికంఠం కిన్నరీకంఠం. అంత అందమైనకంఠం నేనెక్కడా వినలేదుసుమా! సంగీతంలోకూడా మీకుతగ్గ తెలివితేటలున్నాయి. ముచ్చటపడి నీకు యెంతబాగా సంగీతం నేర్పారో అంతయిదిగాను మీనాన్నగారు యీఅమ్మాయికి నేర్పుతున్నారు. మా మంచిపిల్ల. నేనంటే ప్రాణం. కూతుళ్లిద్దరు కాపరాలకెళ్లినందుకు నాకు మూడవకూతురైంది."

ఆరోజునుంచే విజయకి మీనాక్షికి కృష్ణా, తుంగభద్రా సంగమమైనది. విజయానందని పుట్టింట రెండునెలలు ఉంది. ఆరెండునెలలలో వేణీభరం కూర్చేపద్ధతుల్లో, సొగసైన వస్త్రాలు యెన్నుకొనే విధాల్లలో, నగలు అలంకరించుకొనేరీతుల్లో, పువ్వులు ముడుచుకొనే మోస్తరుల్లో, మొహానికి మంచులు, వెన్నలు, పవుడర్లు, పెదవులకు, బుగ్గలకు రంగులు సొగసుచేసుకొనే సూత్రాలల్లో, టాల్కం పౌడులు దేహానికి అద్దుకునే అందాల్లలో, యూడీకొలోను, లవండరు మొదలైన పరిమళజలాలు బట్టలపైజల్లుకొనే బావల్లలో విజయ మీనాక్షికి గురూపదేశము చేసినది.

విజయ సంగీతంలో సరస్వతి. గొంతుక అతి అందముగా ఉండకపోయినా ఉత్కృష్టమై సూక్ష్మాతిసూక్ష్మమైన శ్రుతి, స్వర, లయజ్ఞాన ముండుటచేత వినేవారి హృదయాలలో అమృతబిందువులు కురిసేటట్లు పాడగలదు. ఆమెయున్న రెండు నెలలలోను మీనాక్షి పదియేళ్ల విద్య నేర్చుకొన్నది.

ఆరెండు నెలలు కామేశ్వరరావు మీనాక్షితో తా నొక్కడే యెక్కువచనువుగా యుండేందుకు వీల్లేకపోయింది. కామేశ్వరరావు సంగీతం నేర్చుకోడం విజయకు ఆశ్చర్యమే వేసినది. విజయ మీనాక్షిని వెనకవేసుకొని చిత్రలేఖనాన్ని గురించి, హిందూదేశములో యుండే అద్భుత శిల్పవిన్యాస దేవాలయనిర్మాణాది విచిత్రాలని గురించి కనుక్కుంటూయుండేది. ఎంత అతినవీనపద్ధతిని వేషంవేసుకున్నా విజయ యంటే కామేశ్వరరావుకు యెక్కువ గౌరవము భయమున్నూ. వంచినతల యెత్తకుండానే మాట్లాడేవాడు. కన్నింగ్‌హామ్ ప్రభ్వియొక్క అజంతాబొమ్మలబుక్కు, ఫెర్గుసన్‌గారి భారతీయ శిల్పగ్రంథాలు మొదలైనవి తెప్పించి కామేశ్వరరావు వాళ్లిద్దరకూ చూపించేవాడు. ఇంతలో విజయ అత్తవారింటికి వెళ్లిపోయినది. అమ్మయ్యా అని కామేశ్వరరావు నిట్టూర్పు విడిచాడు.

ద్వితీయ భాగం

౧

మీనాక్షి రెండేళ్లు గురుకులవాసము చేసింది. వచ్చినచదువు చాలునని ఇంతలో ఆమెతాత వీరయ్య గరుత్మంతుడులా వచ్చి మనుమరాల్ని తీసుకు చక్కాపోయాడు. అబాలిక సీతారామయ్యగారికడ సెలవుపుచ్చుకొని ఆయనపాదాలకు, ఆయనభార్యపాదాలకు నమస్కారంచేసి తల్లిదండ్రులను వదలివెళ్లే బిడ్డలా వెక్కివెక్కి యేడ్చినది.

ఆదంపతుల ఇరువురకిన్ని కళ్లు చెమర్చినవి. వీరయ్య మనుమరాలిచేత తాంబూలములో పదికాసులు పెట్టి ఇప్పించబోగా సీతారామయ్యగారు కోపగించుకొని వీరయ్యను తలవాచేటట్లు చీవాట్లు పెట్టినారు.

"ఆమె నాకూతురు. అల్లాంటి అమ్మాయికి చదువుచెప్పడం నాఅదృష్టం." సీతారామయ్యగారు భార్యచేత మీనాక్షికి పసుపు, కుంకుమ, చీరయు, రవికలగుడ్డయు ఇప్పించినారు.

కామేశ్వరరావుహృదయం దడదడమని కొట్టుకుంటూండగా కుంగిపోతూ అచటనే నిలబడియున్నాడు. మీనాక్షికోసం తెప్పించిన తొంబదిరూపాయిల తంబూరాను ఆమెకిఇస్తూ "మీనాక్షీ! ఈ నన్ను మరిచిపో" అన్నాడు.

మీనాక్షి వెక్కివెక్కి యేడ్చినది. కామేశ్వరరావును వదిలిపెట్టివెళ్లుట ఆమెకు అంతరాంతరాలల్లో మరీ కష్టమైతోచింది.

౨

అపుడు జట్టంత బెజవాడలోఉంది. వీరయ్య, వితంతువు, చిన్నవీరయ్య మీనాక్షిని ఆనమాలుకట్టలేకపోయారు. ఆబాలిక పెంటకుప్పలోనుంచి బయలుదేరిన చేమంతిచెట్టులా ఉన్నది.

మీనాక్షి తనవాళ్లను యెగాదిగా చూచుకొన్నది. వంద సంవత్సరాలక్రితం ఉతికినబట్టలు కట్టుకుంటూ, వారానికి ఓమారైనా స్నానంచేయకుండా తిరుగుతూ, నానావిధ నీచపదార్థాలు తింటూ, ఊరుబైటవేసుకున్న గూడుగుడిశల్లో సామానుమోసుకొనేందుకు ఉపయోగించే గాడిదలతోటి, కాపలాకాసుకొనేందుకు ఉపయోగించే పులుల్లాంటి కుక్కలతోటి సావాసంచేస్తూ, నూనిరాసుకొని దువ్వుకోకుండా పేలుపట్టియున్న తలలతో, నెత్తిమొత్తీ రాళ్లపూసల పేర్లనగలుధరించిన మెళ్లతో, వెండిమురుగులు అలంకరించిన చేతులతో, బంగారుగుల్ల దండకడియాలు దాల్చిన బాహులతో, వెండిబిళ్లల మొలనూళ్లతో, వెండివడ్డాణాళ్లతో, పొగాకు, తామలపాకూ గారలుకట్టించిన నోళ్లతో తనచుట్టూ ఉన్న తనచుట్టాలిని చూసేటప్పటికి, మీనాక్షిహృదయం క్రుంగిపోయింది. సీతారామయ్యగారి ఇల్లు, ఆరోజుల తనజీవితము మీనాక్షికి కళ్లయెదుట అస్తమానమూ ప్రత్యక్షమవుతూనేఉన్నది.

ఈరెండేళ్లూ, సీతారామయ్యగారు తండ్రిఅయ్యాడు, ఆయన భార్య తల్లిఅయినది, ఆయనకుమార్తె అక్కఅయినది, కామేశ్వరరావు ప్రాణస్నేహితుడైనాడు. కంపులతో, పెంటలకోగులతో నిండియున్న ఆ యేలూరికాలవగట్టు నరకకూపమై తోచింది. కామేశ్వరరావుగారు తనకు పదేపదేచెప్పిన ప్రకృతివిలాసాలేమీ ప్రత్యక్షంకాలేదు సరేకదా, ఆకాశాన్ని నక్షత్రాలు గాడిదలడ్డెలలా కనపడ్డా యాబాలకు. బెజవాడచుట్టూ ఉన్నకొండలు పాడైపోయిన పూరిగుడిసెల్లా ఉన్నాయి.

ఎందుకు తనకీసంగీతం నేర్పించారు? బాగా బతకడంయొక్క అందం ఎందుకు తనకు నేర్పుట? అడవికట్టుకు శిల్పసౌందర్యం యిచ్చింది మళ్లీ ముళ్లడొంకల్లో పడవేయడానికా? అమెకు జలజల కన్నీళ్లు ప్రవాహాలు కట్టినవి. తండ్రీ తాత, తల్లీ వాళ్లు యమకింకరుల్లా కనపడ్డారు. కామేశ్వరరావుగారి పాదాలు కొలుస్తూ, దాసీలా ఇంతిసేవ చేస్తూంటే బాగుండునే! గురువుగారికి, గురువుగారి భార్యకు వాళ్లింటో పనిచేసే మనిషిలా తాను చాకిరీచేస్తూ ఉండిపోతే బాగుండునే! గురువుగారూ, కామేశ్వరరావుగారూ ఎందుకు తన్ని తాతగారు తీసుకొస్తూంటే ఊరుకొన్నారో. కామేశ్వరరావు నాయుడుగారు తియ్యటికబుర్లు చెపుతూంటే తాను నిజమనుకొంది. మలాంచేసి జీనువేసి, మంచిదుస్తులువేసినా గాడిద గుఱ్ఱం ఏలా అవుతుందని వాళ్లిద్దరూ తన్ని వదిలేసి ఉంటారు. కులదైవము రాములవారు అసలున్నారా?

ఆరాత్రల్లా నిద్రపోకుండా ఏడుస్తూనే ఉన్నది మీనాక్షి.

... ...

వీరయ్య తన మనవరాలు మళ్లీ తిరిగి తన జట్టులోనికి వచ్చినదనిన్నీ, పేరుపొందిన సంగీతపాటకుడను సీతారామయ్యగారి దగ్గిర సంగీతవిద్య నేర్చుకొని గొప్పపాటకురాలైనదనిన్నీ బెజవాడ నగరాలపేటలో చాటింపించాడు. ఆరాత్రి ఆకెళ్లవారి సత్రందగ్గిర తోలుబొమ్మలు చూడడానికివచ్చిన జనం బెజవాడ పుష్కరానికన్నా రారు. ఉత్తరగోగ్రహణంకథ ప్రారంభించారు. మీనాక్షిది సైరంధ్రిపాత్ర. బొమ్మలాటపాకలో ఒకమూల నలిగిపోయిన పువ్వుల దండలా, చంద్రుడులేకుండా కారుమబ్బులుపట్టి, తుంపర్లు పడుతూన్న రాత్రిలా కూచునిఉంది. రెడ్డియ్య విఘ్నేశ్వర, సరస్వతీ ప్రార్థనలవగానే "ఆలాగున ధర్మరాజులవారున్నూ, భీమసేనులవారున్నూ, అర్జునమహారాజున్నూ, నకుల సహదేవులైన కవలలున్నూ, ద్రౌపదీదేవిమహారాణియూ, ధౌమ్యులవారితోకూడానున్నూ" అని అన్నాను.

"ఆహాఁ!"

"పన్నిండేళ్లున్నూ అటవీ, అరణ్యం, విపినం, గహనం, కాననం, వనం ఇత్యమరః, అయినటువంటి అరణ్యంలో వాసం చేసినవారు అవుకుంటూ___"

"ఆహా! ఇక ఏలాగయ్యా? సంవత్సరో, వత్సరో, అబ్దో, హాయనో, శరత్సమాః, ఇత్యమరః, ఒక సంవత్సరం అజ్ఞాతవాసం చేయవలసుంటుంది అని ఆలోచించుకుంటూ"

"ఆహా!"

ఈరకంగా కథసాగించారు. ఇంతలో ద్రౌపది పాటపాడవలసిన సమయం వచ్చింది. జట్టు అందరూ మీనాక్షివైపు చూశారు. ఆబాలిక మోకాళ్లు ముడుచుకొని కూర్చొని, మోము మోకాళ్లలో ఉంచుకొని, చేతులు మోకాళ్లకు చుట్టుకొని, కళ్లలోంచి అశ్రుబిందువులు రాలుస్తూ కూర్చొని ఉండి, ఈ లోకంలోనే లేదు. తల్లి వెళ్లి మీనీ, "మీనీ పాటపాడ్డానికిరావే, నీదుంపతెగ. మొద్దులా కూర్చున్నావేమే? లే! వచ్చిపాటపాడు"అని కేకలువేసినది. చిచ్చురపిడుగులా లేచింది మీనాక్షి.

"నేను పాడదలుచుకోలేదు. మీసరుకులు మోసే గాడిదలులా మీరుకూడా గాడిదలు. తోలుబొమ్మలాటా? ఇది దెయ్యాలాటా?" అని కాళ్లు గబ గబ భూమికేసి తన్నింది. తల్లి బ్రతిమాలడం, తండ్రి కేకలువేయడం, అంతా తాతగారు చూస్తున్నాడు. అందాకా ద్రౌపదిభాగం చిన్నవీరయ్యకు క్రొత్తగావచ్చిన భార్య చదువుతూవున్నది. వీరయ్యకు కోపమువచ్చింది. ప్రళయకాలరుద్రమూర్తిలా అయిపోయాడు. రెక్కలుపట్టి నుంచోపెట్టాడు. "నీకు సంగీతం చెప్పించినందుకా ఇంత పొగరమోతుతనం? అంతట్లోకే మహారాణివైనావనా నీ వుద్దేశం. ఛండాలపురండా! లే, వచ్చిపాడు. చావగొట్టివేస్తాను" అని ఉరిమినాడు.

తాతగారి కోపంచూపి దడదడలాడుచూ, భయముతో తెరదగ్గిరకువచ్చి, మద్దెలకు నమస్కరించి, పాటయెత్తినది. శ్రుతి కలవదు. వెనకటివరస రాదు. గొంతుక స్థాయికి పెరగదు. అందరూ అందిచ్చినారు. నాలుగుగొంతుకలూ కలిసినవి. కాని మీనాక్షిగొంతుక అందుకోదే! పదిహేనునిమిషాలు తంటాలుపడ్డారు. మీనాక్షిగొంతుక అపశ్రుతి తప్పుకోదూ సామ్యం ఏర్పడదు. తెరఅవతల ప్రజల్లో గడబిడలు బద్దేరాయి. "మీనాక్షిని పాడమనండీ" "మీనాక్షిని పాడమనండీ" అని కేకలు. మీనాక్షి పాడలేదు. అందరికీ వెర్రెత్తిపోయింది. వీరయ్య అన్యాయంచేశాడు అంటూ ఉప్పెనకెరటం విరుచుకుపడ్డట్టు జనం అంతా పందిరిమీదకు విరుచుకుపడ్డం మొదలెట్టారు. వీరయ్య గజగజలాడిపోయినాడు. మీనాక్షి నిద్రలేచివచ్చినట్లులేచి వెనకటిగొంతుక తెచ్చుకొని వెనకటిలా పాడబూమని ఎంతైనా ప్రయత్నం చేసినది. కాని లాభం లేకపోయినది. ఆమెకు కళ్లనీరు కారాయి. వెక్కివెక్కి ఏడ్చింది.

జనంవచ్చి తెరమీదపడి తెరపీకేశారు. విశలుమ ఈఁగడిబిడం తాచూసి, ఆడవాళ్లని చేతికిదొరికినన్ని బొమ్మలు పట్టుకొని పారిపొమ్మన్నాడు. మిగిలినబొమ్మలు చిన్నవీరయ్యచేతికిచ్చి పరిగెత్తమన్నాడు. తిత్తీ, మద్దిలా ఇచ్చి తండ్రిని పంపిచేశాడు. ఇంతట్లో నగరాల్లో ఒకవస్తాదులజట్టు, వీరయ్యంటే మంచభిప్రాయం కల్గినది, లాటీకఱ్ఱలతో రంగంలో ప్రవేశించి, దెబ్బలాడి ప్రజలు పాక అంటించకుండా చూశారు. జనం అంతా వెళ్లిపోయినతరువాత విశలుడు తక్కినవన్నీ సద్దుకొని తమ గుడిశెలకాడికి చేరుకున్నాడు.

జట్టును లేవదీసుకొని బందరు పారిపోయాడు వీరయ్య.

3

కామేశ్వరరావుకు మీనాక్షి వెళ్లినప్పటినుంచీ మతిలేదు. అతనిప్రేమకు మీనాక్షి నిదానమైపోయింది. యౌవనము వచ్చిన ఇన్నాళ్లకు ప్రేమంటే ఏమిటో తెలుసుకున్నాడు. మీనాక్షితో రెండేళ్లు స్నేహంచేసి మీనాక్షీ, తానూ సహాధ్యాయులై, మీనాక్షికి తాను గురువై, మెలిగినతరువాత, తీరా మీనాక్షి వెళ్లిపోయినవెనుక తన్ని మూలమంతా కదల్చివేసిన ప్రేమతో ప్రేమిస్తున్నానని గ్రహించాడు. ఆమెమాటలు, దివ్యమైన ఆమె గాంధర్వమూ, విచిత్రసుందరమైన ఆమెమూర్తీ అతని బ్రతుకు చుట్టూ మహాప్రపంచములైనవి. మీనాక్షినామము జపమైనది. "దేవీ మీనాక్షీ" అని అతనిహృదయకుహరాలలో పల్లవి సర్వకాలమూ నదిస్తూనేయున్నది.

భీమవరంలో ఒక్కనిముషం ఉండలేకపోయినాడు. రెక్కలకట్టుకొని బెజవాడవచ్చిపడ్డాడు. అక్కడ వాకబుచేసి బందరువెళ్లారని తెలుసుకొని సాయంత్రానికి బందరుచేరుకున్నాడు.

వీరయ్యజట్టువాళ్లు ఇనుపదుర్గ్లో తమపూరిగుడిశెలనిర్మించుకొని నిర్మించుకొనియున్నారు. కామేశ్వర్రావు తిరిగి తిరిగి అక్కడకు చేరుకున్నాడు. తనఆత్మలో, ఆత్మయగు మీనాక్షి ఆపూరిగుడిశెల్లో ఉండనేభావం ఆతన్ని దహించివేసింది. ఇదివరదాకా తోలుబొమ్మలవాళ్లు అల్లాంటి పూరిగుడిశెల్లో ఉండడం అతనికేమీ ఆశ్చర్యం కలుగజేయలేదు. అక్కడికివెళ్లి "వీరయ్యా" అని కామేశ్వర్రావు కేకవేసినాడు. వీరయ్య ఇవతలికి చక్కావచ్చినాడు. కామేశ్వర్రావుగారినిచూసి "బాబూ, యిల్లాగవచ్చే కేమిటి" అని ప్రశ్నించాడు. కామేశ్వర్రావు ప్రక్కనేవున్న తూముకాలవకు కట్టిన అరుగుమీద కూర్చొని వీరయ్యని ప్రక్కనే కూర్చోమన్నాడు.

వీరయ్య కామేశ్వర్రావునిచూసి "బాబూ, నానోటిదగ్గర వున్న కూడు క్రిందకి బోర్లాపడిందిసామీ" అని బెజవాడలో జరిగినదంతా పూసగ్రుచ్చినట్లు వెళ్లబోసుకొన్నాడు. "సీతారామయ్య బాబుగారు మాపిల్లను పాడుజేసారు సామీ, పాటపాడలేదు. గొంతుయెత్తలేదు. ఆట కెందుకూ పనికిరాకుండాపోయింది." అతడు నుదిటిమీద కొట్టుకున్నాడు.

కామేశ్వర్రావు అంతా నిమిషంలో గ్రహించాడు. అతనికి ఒక చక్కని ఆలోచన మృదువుగాతట్టింది. లేచినుంచొని వీరయ్య బుజంమీద చెయవేసి "వీరయ్యా, నువ్వేమీ కంగారుపడకు. గురువుగారు చేసిన దెప్పుడూ తప్పుకాదు. అందులో మాగురువుగారు పరమపవిత్రుడు. నువ్వు ఒకవారంరోజులు ఆటాగీటా తలపెట్టకు. ఓపికపట్టిమాత్రం యెదురుచూస్తూఉండు" అనిచెప్పి ఆచీకట్లలో మాయమైపోయాడు. వీరయ్యకు ఆశ్చర్యంవేసింది. కామేశ్వర్రావుగారు ఏమిచేస్తారా అని అనుకుంటూ తనగుడిశెకుప్రక్క ఆరుబయటవేసిన నులకమంచమువీద నిద్రపోతూవున్న మనమరాలనుచూసి "తల్లీ నీకు మీనాక్షీదేవి పేరు పెట్టుకొన్నాను. ఏంచేస్తావో?" అని తలపోసుకున్నాడు.

౪

బందరులోవుండే వుద్యోగస్థులకు, వర్తకులకు, భాగ్యవంతులకు ఒకరోజున ఆహ్వానపుపత్రికలున్న కవర్లువచ్చాయి.

గొప్ప సంగీతపు ప్రదర్శనం

శ్రీమతి మీనాక్షిబాయి

ఆర్యా,

అభినవ మీర యనదగిన ఈబాలికకంఠము మాధుర్యాతిమాధుర్యము. పాండిత్యము పండితులచేతనూ మెప్పుపొందదగినది. కాన తాము విచ్చేసి ఈబాలికాగానపవిత్రతలో దివ్యులుకండని మా ప్రార్థన.

మచిలీపట్టణము, } ౧౬-౪-౧౯౫౪ }

కామేశ్వరరావు, ఎం. ఏ.,
సీతారామయ్య.

మీనాక్షిబాయి ... గాత్రము
సీతారామయ్య ... ఫిడేలు
మణిఅయ్యరు ... మృదంగము

రేపు ౧౭-౪-౫౪ తారీకున ——హాలులో ౫ గంటల నుండి ౮ గంటలవరకు——

కామేశ్వరరావు పెద్దలందరకూ ౩రూపాయల టిక్కెట్లు పంపినాడు. బందరుపురమున నున్న సంగీతపండితు లందరికడకూ కామేశ్వర్రావు స్వయముగా వెళ్లి వారి నాహ్వానించి, వారికి గౌరవపు టిక్కెట్లిచ్చినాడు.

ఊరంతా పేపర్లు పంచిపెట్టబడినవి. ౧౭-వ తారీఖున ౫౦౦ రూపాయల టిక్కెట్లమ్మబడినవి. హాలు కిటకిటలాడుతూ వున్నది. మణిఅయ్యరూ, సీతారామయ్యగారూ, పక్కవాద్యాలు వాయించే ఈప్రతిభాశాలిని ఎవరయ్యా? అనుకుంటూనే వచ్చారు జనమంతా. సరిగా అయిదు అయ్యేటప్పటికి సీతారామయ్యగారు, మణిఅయ్యరుగారు, మీనాక్షీబాయీ వచ్చి కూర్చున్నారు. సభను చూసి మీనాక్షి గజగజలాడిపోయింది. అందాలు కుల్లుచుడుతూ ఉమాదేవిలా వచ్చిన ఆబాలికాదేవిని చూసి "యీమెపాట యీమె అందానికి తగిందేనా?" అని అనుకున్నారు. సభా ప్రారంభములో మీనాక్షి కొంత జంకింది. ఆనందరసవాహినియగు సీతారామయ్యగారి ఫిడేలు, లయామృతవర్షిణి యగు మణిఅయ్యరుగారి మృదంగం శ్రవ్యంగా వినబడుతూవున్నవి గాని మీనాక్షిగొంతుక ఎవ్వరికీ వినబడలేదు. పక్కనుండి సీతారామయ్యగారు "కళ్లుమూసుకొని పాడమ్మా తల్లీ" అని రహస్యంగా చెప్పారు.

మీనాక్షి కళ్లుమూసుకొని గురువుగారిని తలుచుకొని సమస్తమూ మరిచిపోయి, ఉత్కృష్టగానంతో అద్వైతరూపిణి అయినది. ఆమెకంఠము సంపూర్ణముగా వికసించిన మాలతీతీగలా ఆసభ అంతా అల్లుకుపోయింది. ప్రేక్షకులు అట్టి గొంతుక ఇదివరకు యెన్నడూ వినలేదూ, అట్టి సంగీతం ఎప్పుడూ వినలేదు. సభ పూర్తి అయ్యేటప్పటికి సభికులందరూ తన్మయులై ఉన్నారు.

పట్టణములోని పెద్దలూ, సంగీతవిద్వాంసులూ లేచి, మీనాక్షిని పొగడుతూ ఉపన్యాసాలు ఇచ్చారు. జగద్విఖ్యాతులగు మణిఅయ్యరుగారినీ, సీతారామయ్యగారినీ గురించి చెప్పనక్కరలేదన్నారు. ఇంకోసభ ఆపట్టణంలో ఇవ్వాలనికూడా వారు కోరారు. ఆవెనక రెండురోజులైనతరువాత సభలో ౧౨ బంగారుపతకములూ, ౧౦౦ రూపాయల వెండిగిన్నె మీనాక్షికి బహుమతు లిచ్చారు.

ఇదంతా చూసి వీరయ్య ఆశ్చర్యపూరితుడైపోయాడు. అలాంటిసభలూ చూడలేదు, అలాంటిపాటా వినలేదు. ఈమనమరాలు సంపాదించిందని ౫౦౦ రూపాయలు తీసుకొచ్చి వీరయ్య ఒళ్లో పోశాడు కామేశ్వరరావు. ఆరునెలలు ఆటలాడినా వీరయ్య

౩౦౦ లేనా కళ్లచూసేవాడుకాడు. కామేశ్వరరావు వచ్చినడబ్బంతో తొమ్మిదివందలయేభైఅనిన్నీ, మణి అయ్యరు గారికి రానూపోనూఖర్చు లక్రింద, బహుమతీక్రింద, తక్కినవి పేపర్లు అచ్చు వేయించడం, ఊరంతా పంచిపెట్టడంవాట్లక్కీ అయినఖర్చు నూరురూపాయలు అనిన్నీ, ౫౦ రూపాయిలు హాలుఅద్దె అనిన్నీ లెక్క చెప్పాడు.

కామేశ్వర్రావు వీరయ్యతో మీ రల్లాంటి పూరిగుడిసెలలో ఉండకూడదని, భండాలపు నీచపదార్థాలు తినకూడదనిన్నీ వీరయ్యతో హోరాహోరీని దెబ్బలాడి, ఆగుడిసెలు గాడిదలు వాళ్ల బట్టలన్నీ, ఇతరబీదవాళ్లకు దానా లిప్పించాడు. వీళ్లందరినీ తీసుకొచ్చి సత్రములో పెట్టాడు. శుభ్రమైన వస్త్రాలు కట్టబెట్టించాడు. మీనాక్షి హృదయం సంతోషంతో సంగీతాలు పాడుకొనేటట్లు, వీరయ్య జట్టువాళ్లందరికీ నాగరకతాదీక్ష నిచ్చాడు.

మీనాక్షిసంగీతసభలు నెల్లూరు, గుంటూరు, బెజవాడ, ఏలూరు, రాజమండ్రి మొదలైన పెద్దపురాలలో పెట్టించి విశాఖపట్టణంలో సభ జరుగుతుందని ప్రకటించాడు. సీతారామయ్యగార్ని, అళహసింగరిశిష్యుడైన ఒక తెలుగుమార్దంగికుణ్ణి తీసుకొని, కామేశ్వర్రావు ఈసభలు చేయించాడు. భారతీయసంగీత మహాకాశంలో ఒక ఉత్కృష్టనక్షత్రం బయల్దేరిందనిన్నీ, మీరాబాయి మళ్లీ అవతారం దాల్చిందనిన్నీ పత్రికలన్నీ ప్రశంసించాయి. మీనాక్షికి మెడల్సూ, హారాలూ, వెండివస్తువులూ మొదలైన బహుమానాలు వానలాగు కురిశాయి.

౨

మీనాక్షికి కామేశ్వర్రావంటే వెఱ్ఱిస్నేహభావం మొదటి నుంచీ ఉంది. కాని స్త్రీపురుషసంబంధ మగు ప్రేమభావాలన్నీ ఆమెకు కల్గలేదు. స్త్రీపురుషులకుండే ప్రణయభావంగాని, మోహభావంగాని ఈలావుంటుందని సంగతి ఆమెకు తెలవదు. ఆమె చూపించే హావభావ విలాసాలు ఆమెహృదయంలో తాండవము చేస్తూ ఉన్న శైశవ, బాల్యదశలకు సంబంధించినవే. రూపంలో మూర్తీభవిస్తూ ఉన్నప్పటికీ, ఆబాలికలో స్త్రీత్వము ఇంకా మనఃపథాలల్లో ఆవిర్భవించ నన్నా లేదు. కామేశ్వర్రావువచ్చి చేసిన ఈ అద్భుతమంతా చూసి, మీనాక్షి విస్తుపోయి వెఱ్ఱియానందంలో మునిగిపోయింది. కామేశ్వర్రావును కౌగలించుకొన్నది. "నాయుడుగారు, మీరు గొప్ప మాంత్రికులా ఏమిటి" అని అన్నది. అతనికి అన్ని చాకిరీలూ చేసేది, తలదువ్వేది, నీళ్లు పోసుకునేటప్పుడు సబ్బుపెట్టి ఒళ్లు రుద్దేది తామలపాకులు రాసియిచ్చేది.

భార్యచేసే చాకిరీలలాంటి ఈపరిచర్య చూస్తూ కామేశ్వర్రావు ఈబొమ్మలకాణి తన్ను సంపూర్ణముగా ప్రేమిస్తూన్నదని భావించుకున్నాడు. ఆమె తన్ను ముట్టుకున్నప్పుడల్లా అతనిఒళ్లు ఝల్లుమనేది. ఆమె తనదగ్గిరగా వచ్చినప్పుడల్లా తనఒళ్లోకి తీసుకొనే వాడు. ఒకనాడు తనదృఢబాహువుల్లో ఆబాలికను అదిమిపట్టుతూ, సవసవలాడు ఆమె నునివెచ్చనిదేహమును తనదేహాన్ని పులకరించగా, బుగ్గలపై, కంఠంపై, కన్నులపై, తలపై ముద్దులవర్షం కురిపించి ఆమెపెదవులను చుంబించనారంభించినాడు. మీనాక్షిహృదయం జల్లుమన్నది. ఒళ్లు ఉప్పొంగిపోయింది. ఆమెలోని బాలికాత్వము పువ్వురేకులలా రాలిపోయింది. ఆబాలిక అతనికౌగలింతలోనే జవ్వనియగు స్త్రీ అయినది. కాని కామేశ్వర్రావుపై ఇంకనూ ప్రణయభావ మేమాత్రమూ కలుగలేదు. స్త్రీత్వమంకురించిన సునుత్రోత్తతో పైకుబికిన మోహము ఆమెను వివశనొనరించడంవల్ల, ఆమె అతన్ని కౌగిలింతలో హత్తుకుపోయింది.

ఆమహాతరంగం దాటిపోయింది. మీనాక్షికి మెలకువ వచ్చింది. ఆమె అతనిబాహుల్లోంచి విడిపించుకొని ఆగదిలోంచి బయటపడి తనగదిలో మంచంమీదపడి దొర్లుతూ ఎందుకో తనకే తెలియకుండా వెక్కి వెక్కి ఏడవడం ప్రారంభించింది. ఆగంభీర విషాదానికి కన్నీళ్లన్నా లేవు. ఆమెరావాకులా గజగజ వణికిపోయింది.

కామేశ్వర్రావుకు మీనాక్షి తన్నిప్రేమిస్తోందనే గాఢ నిశ్చయం చేసుకున్నాడు. ఇంక తనకర్తవ్యం ఏమిటి? తనకు వివాహం కాలేదు. మీనాక్షితో వివాహంపనికిరాదా. వివాహం లేకపోతే మీనాక్షితో పులకరించే స్నేహమెట్లా? ఆలాంటి దివ్యమైత్రి తనఅంతరాత్మకు వ్యతిరేకమా? అది తప్పా? స్త్రీపురుషప్రణయసంబంధానికి వివాహము ముఖ్యమా? పురోహితులచేతనూ, దొంగఆచారాలచేతనూ పుట్టబడిన ఈపెళ్లిళ్లు సత్యబద్ధమైనవా? భగవంతునికి ఇష్టమైనవినా? లేకపోతే వివాహం లేని ప్రణయం పాపభూయిష్ఠమైనదనేమాట నిజమా? ఇంతవరకూ తాను ప్రేమ అనేదేమిటో ఎరుగడు. ఏదో అలంకరించుకొని, పొంకాలు తిరిగియున్న దేహంతో, ఉన్నయువతులు ఆతని హృదయం చెదరగొట్టేవారు. తనకు మోహావేశము కల్గినమాట నిజమే. అంతమాత్రమే. నిజమైన ప్రేమకూడా మోహావేశం ఉన్నది. ప్రణయం కూడా శారీరప్రేమరహితమై అదోరకపు విచిత్రమైన ఉత్కృష్ట ఆశయభావమన్నా తాను నమ్మడు. భగవంతునిమీద ప్రేమా, దేశంమీదప్రేమాకూడా దేహసంబంధం కోరుతున్నాయే!

ఈవిచిత్రసంఘటన గుంటూరులో పురవిశ్రాంతిభవనంలో జరిగింది. సీతారామయ్యగారిక్కీ, వీరయ్యకూ, కామేశ్వర్రావు హృదయం కీనీడగా, చూచాయగా గోచరించింది. వాళ్లిద్దరూ భయపడిపోయారు. అప్పటినుంచీ ఒకరికొకరు సంప్రదించుకోకపోయినా కామేశ్వర్రావూ మీనాక్షీ, ఏకాంతంగా ఉండకండా ఉండేటట్లూ వాళ్లు చూస్తూఉండేవాళ్లు. వీరయ్యకు తాను చేయవలసిన కర్తవ్యము గోచరించలేదు.

పులిమీద పుట్రఅన్నట్లు కొందరు ధనవంతులు ఒకరిద్దరు జమిందారులు వ్యంగ్యపుమాటలతో మీనాక్షిని తమతో ఒకటిరెండు రాత్రిళ్లు, ఇంకా ఎక్కువగాగాని గడిపేటట్లుచేస్తే, పదివేల దాకా కూడ బహుమతులిస్తామని కబుర్లు పంపించారు. వీరయ్య మండి పోయాడు. లోలోన క్రుంగిపోయాడు. ఈసంగతి కామేశ్వర్రావుకు తెలియదు.

వీరయ్య సీతారామయ్యగారితో ఆవ్యాపారం మనవిచేసు కున్నాడు. ఆయన తెల్లపోయినాడు.

సీతా—ఈప్రపంచకములో ఇదో పెద్ద దురన్యాయమోయి! ఎయుత్కృష్టవిద్య నేర్చుకున్నా దెయ్యంనీడలా వెంటపడుతూ వుంటుంది, ఈదురదృష్టము. నాటకాల్లో వేషాలువేసేవాళ్లు, సంగీత పాటకులు, గొప్పవాళ్లయిళ్లల్లో ఉన్నస్త్రీలమోహబాణాలకు గురా? ఆడవాళ్లువస్తే మగవాళ్లు శుంఠలైపోవడమా? ఛీ! ఛీ!!

వీర—ఏమిటండి, ఇప్పుడుపాయం? నాకు మతిపోతోఉంది.

సీతా—నావల్లే ఈదిక్కు వచ్చిందని అనుకుంటానోయ్!

వీర—మాకులంలోవాణ్ణి ఇట్టాంటప్పుడు మాఅమ్మిణికెల్లి చేసుకుంటడా సామీ!

సీతా—అదీ నిజమేనోయ్!

విఠలుడు—మీరు మాఅమ్మిణితో కదిలేస్తురూ సామీ. మాకు దానిదగ్గిరికి వెళ్లడమే భయంగా ఉండది.

మూడవ భాగం

౧

కామేశ్వరరావు జట్టునంతా చెన్నపట్టణం తీసుకెళ్లినాడు. అది ౧౯౩౫-వ సం. డిశెంబరునెల. అడయారులో దివ్యజ్ఞానసమాజముయొక్క షష్టిపూర్తి మహోత్సవము అఖండవైభవంతో జరుగుతూఉన్నది. దేశదేశాలనుంచి సభికులు ప్రతినిధులుగా వచ్చారు. వేలకువేలు సామాజికులు, కానివాళ్లు కూడా, ఉత్సవాలు చూచి ఆనందించడానికి వస్తూఉన్నారు. ఒకవైపు మహామఱ్ఱి వృక్షంక్రింద సభలు. ఒకవైపు చిత్రకళాప్రదర్శనం. ఇంకోచోట బౌద్ధ, పారశీక, క్రైస్తవ, జైన, మహమ్మదీయ, యూధ, హిందూ మతాదుల ప్రార్థనలు. అఖండకోలాహలంగా ఉన్నది.

డాక్టరు జేమ్సు. హెచ్. కజిన్సుపండితుడు భారతీయకళా వైభవసముద్రములో మునిగి ఆనందరసావశ్యుడైపోతూఉంటాడు. భారతీయకళాద్భుతానికి దూరంగా ఉన్న భారతీయమహాశయుల కున్ను, ఇతరదేశీయులకున్ను ఆకళలలో ఉన్న ఉత్కృష్టత వెల్లడించడానికి సంకల్పించుకొన్నాడామహానుభావుడు.

ఆయన ఆ ఉత్సవాలకు జావానుంచి ఒకతోలుబొమ్మలవాళ్ల జట్టు, వీథినాటకంవాళ్ల జట్టు రప్పించి ప్రదర్శనాలు ఇప్పించ్చాడు. ఆప్రదర్శనాలన్ని కామేశ్వరరావు మీనాక్షివాళ్లతోపాటు పారకించినాడు. ఆశ్చర్యపూరితుడైనాడు. ఆతని భావాలు ఆకాశవీథుల పరువులెత్తినవి.

ఆమరునాడు కామేశ్వరరావు కొందరిస్నేహితులసహాయంతో కజిన్సుగారిని కలుసుకున్నాడు.

కామే—జావాతోలుబొమ్మలాట చూచానండి. ఆ ఆట ఆంధ్రదేశంనించే వెళ్లిందని నాఊహ.

కజిన్సు—కావచ్చును. ఈరెండుదేశాలల్లో ప్రదర్శనాలకు చాలా సంబంధం ఉన్నమాటనిజమే.

కామే—ఈఆటలో నాటకం, నాట్యం, సంగీతం, చిత్రలేఖనము, కవిత్వము, భాష మొదలైనకళలన్నీ దివ్యంగా కలిసి ఉన్నాయండి.

కజిన్సు—జావాఆటలో కొన్నిదోషాలు వచ్చాయి, ఆంధ్రదేశంలోని ఆటలో కొన్నిదోషాలు ఆవరించాయి. కళ రానురాను హీనస్థితికి వచ్చింది.

కామే—మానవునిలోఉన్న పశుత్వం (Atavism) ప్రతి వ్యక్తిజీవితంలోను ఒకసారి వచ్చునట్లుగానే ఒకసంఘజీవితంలో కూడా అప్పుడప్పుడు వస్తుందిగాదండి.

కజిన్సు—నువ్వు సరిగా చెప్పావయ్యా! ప్రేక్షకలోకం యొక్క హృదయస్థితినిబట్టి ప్రదర్శనరీతిన్ని మారుతూఉంటుంది. సంఘకళారసజ్ఞత అధోలోకంలోకి పడిపోతూ ఉన్నప్పుడు ఆపతనాన్ని ఆపుచేసి నిలబెట్టే బాధ్యత ప్రభుత్వంవారిపైనా, కళాస్రష్టలపైనా, జమీందారులపైనా, ధనికులపైనా ఉన్నది.

కామే—అవునండి. ఈ తోలుబొమ్మల్లోని ఉత్కృష్టత మరచిపోయి ఉత్తములు విముఖులవడంచేత పాటకజనులు కోసం గంధోళిగాడు, కేతిగాడు, అల్లాటప్పగాడు తెరమీద విజృంభించారు. కాని జాగ్రత్తగా చూస్తే పెద్దపెద్దపాత్రలకు గంభీరమైన అభినయం చిన్నపాత్రలకు వారికితగిన నటన మాచిత్రంగా ఉంటుందండి. రామచంద్రుడు చెయ్యిమాత్రం కదుపుతాడు. లక్ష్మణుడు తలకూడా తిప్పుతాడు. ఆంజనేయులు మొదలైనవాళ్లు దేహమంతా కదుపుతూ అభినయం చేస్తారు. రాక్షసులు గడబిడదడబిడగా బల్లలచప్పుడు, బూరాలమోతలతో నీడల్లావచ్చి, రూపంపొంది, మళ్లీ పొగలా,అయి మాయమవుతారు. తమ రాశీర్వదిస్తే ఉదయశంకరుడు నాట్యకళను పునరుద్ధరించినట్లున్ను, రవీంద్రుడు నాటకకళను క్రొత్తపద్ధతిగ తిరిగి జీవంపోసినట్లున్ను, ఈతోలుబొమ్మలాటకూడా మార్చి ఉత్తమ హృదయులు మెచ్చుకునేటట్లు చేద్దామని ఉందండి.

కజిన్సు—మీభావం, ఆశయం చాలాబాగున్నాయి. నాకు చేతనయినంత సహాయం చేస్తాను.

౨

భారతీయ సంప్రదాయమైన చిత్రలేఖనము నేర్చుకుని ప్రసిద్ధికెక్కిన ఒక ఆంధ్రచిత్రకారకుని కామేశ్వర్రావు చేరదీశాడు.

వీరయ్యతో, విశలుడుతోనున్నూ చాలారోజులు తర్జనభర్జన చేశాడు. తోలుబొమ్మలాట విద్యలో తాను గొప్పమార్పులు తీసుకొస్తాననిన్నీ, అందువల్ల లోకప్రఖ్యాతిన్నీ, మిక్కుటమగు ధనమున్నూ వీరయ్యకు చేకూరుతాయని కామేశ్వర్రావు వాళ్లకి నచ్చచెప్పాడు.

అప్పుచేసి ఒక అయిదువందల రూపాయలు ఖర్చుపెట్టి విజృంభించి పోతూఉన్నటువంటిన్నీ, పురాతన భారతీయ సంప్రదాయాలైన అజంతా మొగలు, రాజపుత్రపద్ధతులలో జపాను టిబెట్టు, పారశీక, పాశ్చాత్యసంప్రదాయాలు సమ్మిళితంచేసి నూతనంగా వచ్చే "వ్యంజ" (Impressionism) "కోణ" (Cubism) మొదలైన రీతులను ఇముడ్చుకుంటూ, కొత్తరీతులు కల్పించుకుంటూ, ఉద్భవించిన నూతనభారతీయ చిత్రలేఖనసంప్రదాయప్రకారంగా రామాయణ భారతకథలకు, భాగవతంలో శ్రీకృష్ణునికథకు సంధ్యాతాండవం మొదలైన శివగాథలకు సరిపడేచిత్రాలు వీరయ్యచేత ఆ ఆంధ్రచిత్రకారకుని సలహాతో కామేశ్వరరావు తయారు చేయించాడు.

ఉదయశంకరుడు తననాట్యానికి ఉపయోగిస్తూఉన్న సంగీతపు హంగుపద్ధతిని కామేశ్వరుడు అవలంబించి గొట్టు, వీణ, వాయులీన (Violin), మహావాయులీన (Violincella), తంబూరా, చితారు, ఇస్రాజ్ మొదలైన వాద్యవిశేషాల్ని వాయించేవాళ్లను పోగుచేశాడు.

వీరయ్యజట్టు మైసూరురాష్ట్రంలో తిరిగేటప్పుడు కన్నడంలో తోలుబొమ్మకథ చెప్పేవారు. వాళ్లు రాయలసీమవాస్తవ్యులు. కాబట్టి ఈకొత్తపద్ధతిని కన్నడంలోనూ, తెలుగులోనూ చెప్పేటట్లు కామేశ్వర్రావు యేర్పాటుచేశాడు.

3

ఈనూతనసంప్రదాయపు తోలుబొమ్మలాట ప్రథమాన్ని అడయారులో శ్రీడాక్టరు కజిన్సు మొదలగు సహృదయులయెదుట, ఓరాత్రి ఎనిమిదిగంటలకు ప్రారంభించి ఆడింపించాడు కామేశ్వరుడు. ఆట పన్నెండుగంటలకు పూర్తిఅయినది.

రంగంలో ఉండవలసిన చిత్రాలమీదే వెలుగుపడుతుంది. ఉండనక్కరలేని బొమ్మలు తెరమీదలేవు. అభినయంనృత్యం రసము ఉట్టిపడుతున్నవి. సంభాషణ చక్కనినుడికారం, తేనెగడులుకట్టే తెనుగు.

హంగుచేసే సంగీతం విచిత్రము. ఉత్కృష్టపాత్రలు కర్ణాటక సంప్రదాయంగానున్నూ, ఇతరపాత్రలు యేలపాటల పద్ధతిగానున్నూ పాటలూ, పద్యాలు గానంచేసినారు. మహారాజు వస్తూఉన్నప్పుడు ఒకవిధమైన సమ్మేళనగానం. మహాఋషి వస్తూఉన్నప్పుడు వినిపించిన సమ్మేళనగానం వేరు. మొదటిది ప్రాపంచికాద్భుతం సూచిస్తున్నది. ఇద్యాది పారలౌకిక భావరసాలు ఉట్టిపడజేస్తున్నది.

అందరూ నిస్సబ్ధులై చూశారు.

మీనాక్షి ఇంతపెద్దకళ్లు చేసుకుని కథఅంతా గమనించింది. ఆమె పేరుపొందిన సంగీతవిద్వాంసురాల నన్న భావంతో తాను జట్టులో పాలుపుచ్చుకోలేదు. కామేశ్వరరావు అందుకని ఆమెను ప్రార్థించనూ లేదు.

తాను బొమ్మలరాణి. ఇంత చిన్నప్పుడు తాను గొంతుక ఎత్తడం ప్రారంభించినప్పటినుంచిన్నీ జట్టువాళ్లూ, పల్లెటూళ్లలో ఇతర్లూ తన్ను ఎంతో ఆదరించేవాళ్లు. తాతగారికీ, తండ్రికీ గారాబుబిడ్డ ఆలాంటి తనహృదయానికి తన రాజ్యానికి మించిపోయిన మహారాజ్యం ఓటి తనకు ప్రత్యక్షమైంది. ఆమె మనస్సు ఓవిధమైన వాంఛామేఘంలో అలముబడిపోయింది. అన్నీ సుళ్లు చుట్టిపోయే ఆలోచనలే. ఇంతలో భయం.

తాను సంగీతంలో సేలం గోదావరిలా, బెంగుళూరి నాగిరత్నంలా పేరు సంపాదించుకోవచ్చును. అది ఆఖరు కాదుకదా ఈవాళనుంచి? కామేశ్వరరావు మళ్లీ తోలుబొమ్మలాట మొదలుపెట్టించాడేమి? ఎంతబాగున్నా తోలుబొమ్మలాట మళ్లీ వద్దు.

ఆమెకు గాడిదపెంటవాసనా, ఏళ్లఏళ్లకు చెమటలో తడి ఆరిపోయిన భయంకరమైనంభండాలపు మురికిగుడ్డలవాసన మళ్లీ కొట్టినవి. ఒళ్లుజలపరించింది. కళ్ల నీళ్లు తిరిగినవి. ఆ నరకంలోంచి రక్షించిన దైవసమానులు సీతారామయ్యగారు, కామేశ్వరరావుగారు. వాళ్లు మళ్లీ అధోలోకంలోకి తన్ను తోసివెయ్యరుకదా! అమ్మయ్యో.

ప్రదర్శనం అయినమర్నాడునుంచి కామేశ్వరరావును చూడ్డానికి ఆమెకు భయంవేసింది. ఒకనాడు కామేశ్వరరావు ఆమెదగ్గరకు వచ్చాడు.

ఆమె మంచంపై పడుకొని మెత్తని దిండులోకి మొహం దూర్చి తలఎత్తకుండా పడుకుంది. కామేశ్వరరావు గదితలుపు చేరవేసాడు. ఆబాలిక దేహసౌభాగ్యకాంతులు ఆనందరేఖల వంపులు పోతూ, ఆసన్నని తెల్లపట్టుచీరలోంచి ప్రతిఫలిస్తున్నవి. ఆమె యౌవనము పూర్ణతదాల్చి ఆమెసౌందర్యానికి యింకా వన్నె తెచ్చింది. కామేశ్వరునిహృదయము వెర్రిఆశలో మత్తుమునిగింది. ప్రేమపూర్ణతచే ఆతడు తూలుతూపోయి మంచంపై పడుకుని ఉన్న మీనాక్షిపై సుందరేశ్వరునిలా వాలాడు. ఆమెను తనబాహు

వుల్లోకి మింగివేసుకొన్నాడు. ఆమె కర్కశత్వముదాల్చి ఆతని బాహువుల్లో కట్టెవలె బిగుసుకొనిపోయింది.

కామేశ్వరరావు ఆశ్చర్యపడి

"మీనా! నేనంటే నీకాపేక్ష లేదా?" అన్నాడు.

"........................."

"ఈమూడేళ్లనించి నాహృదయంలో ఒకదేవాలయం కట్టుకుని అందులో నిన్నధిష్ఠించి పూజచేస్తున్నాను. ఆరోజున మా ఊళ్లో బొమ్మలాటలో నీగొంతుక విన్నప్పటినుంచీ..."

కామేశ్వరరావు తనకౌగలింతలోంచి ఆమెను వదలి ప్రక్కను కూర్చున్నాడు.

"ఆనందంలేని నాజన్మకు ఆనందం ఇచ్చావు, మీనూ! నీ ప్రేమఅనే అమృతంతో నన్ను దివ్యుణ్ణి చేశావు."

మీనాక్షి లేచి కూర్చుంది.

"ఈ కొత్తబొమ్మలాటలోకి నన్ను దింపుతారా యేమిటి నాయుడుగారు?"

"మీనూ, మీనూ! నాకుటుంబం యావత్తూ వదిలివేసా. నా తల్లినీ, వాళ్లనూచూసి యేడాదయింది. నీదాసానుదాసుణ్ణి. నా ఈ జన్మ భయంకరమైన వట్టి యెడారినిచేసినా, పరమ పవిత్రాలైన హిమాలయభూములు చేసినా నీచేతిలోనే ఉంది."

కామేశ్వరరావు మంచముదిగి ఆమె పాదాలకడ మోకరిల్లి ఆమెవళ్లో తలపెట్టుకుని ఆమె నడుంచుట్టు తన రెండుచేతులూ చుట్టి "నాజన్మం పవిత్రంచేసిన దేవిని ఉద్ధరించుకున్న నాకు కృపవరము దొరకదా?" అని అన్నాడు.

మీనాక్షిదృగంచలాలనుంచి వేడిచుక్కలు కామేశ్వరరావు తలపై పడ్డాయి.

"మీరు అద్భుతమైనటువంటి నూతన ప్రపంచంలోకి తీసుకు వచ్చినారు నన్ను. గడ్డిపోచను దవనపుమొక్కను చేశారు. నా చర్మం నీకాళ్లకు జోళ్లు కుట్టిఇచ్చినా నాబాకీ తీర్చుకోలేను."

"ఒట్టి బాకీయేనా?"

కామేశ్వరరావు చటుక్కున లేచి ఆమెబుజాలమీద తన రెండుచేతులూ వేసి ఆమెవేపుకు దీనంగా చూస్తూ ప్రశ్నించాడు. ఇంతలో తలుపుతోసుకొని వీరయ్య, కామేశ్వరరావు మేనమామ, సీతారామయ్యగారు లోపలికి వచ్చారు. కామేశ్వరరావు నిర్ఘాంతం. మేనమామ అతికోపకంఠంతో

"యేమిరా, కాముడూ! చదువుకున్నందుకు ఇదేనా యేంటి? కులం తగలేస్తున్నావు. కుటుంబం తగలేస్తున్నావు. మా అప్ప కుళ్లికుళ్లి మంచంపట్టింది. మేంపదిమందిలో తలయెత్తుకుని తిరగ లేకుండా ఉన్నాం. అప్పులుచేసేసి తమ్ముణ్ణీ నిన్నూ కూడా తగలేసు కుంటున్నావ్. నీకొచ్చిన సమ్మంధాలవాళ్లకి జవాబులుచెప్ప లేకుండా సచ్చిపోతున్నాం. అనంతపురం డిప్యూటీకలక్టరుగారు పిల్లనిస్తామని నాతోకూడావచ్చారు. ఆయన పెద్దవటలులో ఉన్నారు. రా, అక్కడికిపోదాం. నీమూటాముల్లీ సర్దుకో. మనం బీంవారం వెళ్లిపోదాం లెగు."

సీతా—నాయనా! వీరయ్య తనకొడవ తను చూసుకుంటాను. ఆతనిపై దయఉంచి ఇహ ఒదిలెయ్యిమంటున్నాడు. నీధర్మం నువ్వు ఆలోచించుకో.

వీర—కామేశ్వరరావుబాబుగారూ! మీరు మాకుచేసిన ఉపకారానికి మేం యెన్నిజన్మాలెత్తి మీకు సేవజేసినా కృతజ్ఞత తీర్చుకోలేమండి. మాతమ్ముడి కూతురుకొడుక్కిసామీ మాఅమ్మణ్ణిని ఇవ్వడానికి సమ్మందం యేర్పాటుచేసినా. మేంఅంతా ఒరంగలెడుతుండము.

కామేశ్వరరావు తుపాకులయెదుట సింహంలా చుట్టూ తేరిపారచూశాడు. మాట జవాబుచెప్పకుండా అతికోపస్వరూపంతో మూడుఅంగల్లో గుమ్మందాటి విసవిసవెడలి మాయమయ్యాడు.

౪

ఆనాటిసాయంత్రము మీనాక్షి మాయమయింది.

రెండురోజులైనవెనక బెంగుళూరులో మీనాక్షి, కామేశ్వరరావులకు వివాహం అయిందని పత్రికలల్లో ప్రచురణం అయింది. చెన్నపట్నంలో బెంగలుపెట్టుకుని తిండిమానేసుకున్న వీరయ్య జట్టుకుసీతారామయ్యగారు నెమ్మదిగా ఈవార్త వినిపించాడు. విఠలుడుమోము ప్రఫుల్లమైంది. వీరయ్య విషాదంతోనూ, కోపంతోనూ కూలబడిపోయాడు.

ఈవార్తవిని కామేశ్వరరావు మేనమామ మహాగ్రహంతో కామేశ్వరరావుని బండబూతులు తిట్టుకున్నాడు.

సీతారామయ్యగారు కామేశ్వరరావుమేనమామ భీమవరం తిరిగి వెళ్లిపోయారు.

కొత్తతోలుబొమ్మలాటలో పాలుపుచ్చుకునే సంగీతపుహంగుదార్లను యెక్కడికీ కదలకుండా ఉండవలసిందని చెప్పేవెళ్లాడట కామేశ్వరుడు.

తామిద్దరమూ వస్తున్నామని వీరయ్యకు కామేశ్వరరావు తంతి నిచ్చాడు.

* * * * * *

వికసించిన గులాబిపువ్వుమోముతో మీనాక్షిదేవి తాతగారి దగ్గఱకువచ్చి నమస్కారం చేసింది, ఆమెపెదవులు చిరునవ్వు నవ్వు

తున్నవి. ఆమెకళ్లు చిరుభయంతో బెదరుతున్నవి. ఆమెఫాలంలో ముంగురులు చిరుగాలిలో చెదరుతున్నవి. ఆమె వాక్కులు చిరు కంపంతో తొణుకులాడినవి.

"నీమొహం చూడకూడదు, అమ్మణీ!"

"........."

"నువ్వెంత పాపం చేశావో నీకు తెలుస్తుదా?"

"........."

"నీకు పుట్టినకొడుక్కి నాపేరు పెట్టుకోకు."

"తాతయ్యా, నీకు దణ్ణం పెడదామని అవతల నుంచుని ఉన్నారు."

"కామేశ్వరరావుగారు ఒకదేవుడు."

* * * * * *

కొత్తపద్ధతిలో అద్భుతమైనటువంటి అజినచిత్రనాటకప్రదర్శనం మ్యూజియమ్ నాటకప్రదర్శనశాలలో జరుగునని చెన్నపట్నంలోని పత్రికలన్నీ ప్రచురించాయి. ఆప్రదర్శనంలో బొమ్మల రాణి మీనాక్షీదేవికూడా పాలుపుచ్చుకుంటుందనిన్నీ, ఇంత విచిత్రమగు ప్రదర్శనం భరతదేశంలో ఇదివరకు చూపింపబడలేదనిన్నీ, ఈ ప్రదర్శన సూత్రధారుడైన కామేశ్వరరావుగారు యెంతయూ అభివందింపబడ తగినవాడనిన్నీ మొదలైన సంగతులతో జట్టులో పాల్గొనేవాళ్ల ఛాయాచిత్రాలతో పత్రికలు వ్యాసాలు ప్రకటించినవి. ప్రదర్శనము శ్రీగవర్నరుగారి అధ్యక్షతను జరుగుతుందట.

* * * *

ఆప్రదర్శనం చూచినవాళ్లంతా సంతోషంతో విస్తుపోయినారు. ప్రదర్శనానికి పదకొండువందలరూపాయిల టిక్కట్లమ్మబడినవి.

నాటకంలో ఉన్న అందం, సినీమా, టాకీలోఉన్న అందం, చిత్రకళా ప్రదర్శనంలో ఉన్న అందం కలవేసి ఈనవీనపద్ధతి చూరకొన్నదని పండితులు వ్యాసాలు వ్రాశారు.

* * * * * *

ఓనాడు ఉదయాన్ని మోటారునుంచి కామేశ్వరరావు భార్యతో భీమవరంలో తనఇంటిదగ్గర దిగినాడు.

బెంగచే కృశించి తల్లి మంచముపట్టి ఉన్నది. ఇంతలో మెరుపుతీగలాంటి ఒక బాలిక ఆమె పాదాలకడ వ్రాలి, పాదాలపై తలఉంచి, పాదాలు పట్టుకున్నది. కామేశ్వరరావుతల్లి నెమ్మదిగా లేచి, "యెవరమ్మా నువ్వు?" అని బాలిక తలపట్టుకొని యెత్తి మోము తేరిపారచూచింది.

"నువ్వెవరు, తల్లీ?"

ఆబాలిక కన్నుల జలజల బిందులు రాలిపోతున్నవి.

"నువ్వు దేవతాకన్నెవు కాదుగదా?"

వర్షం కురుస్తూన్నప్పుడు వచ్చే వెన్నెలలా ఆబాలిక పెదవులు నవ్వాయి.

కామేశ్వరరావు తల్లి, "నాబంగారుతల్లి, నువ్వెవరో తెలియదు నాకు" అని ఆబాలికని దగ్గరకు లాగుకొని హృదయానికి అదుముకున్నది.

ఇంతలో కామేశ్వరరావు గుమ్మముకడ నిలుచుని వున్నాడు.

"అమ్మా! మీఆజ్ఞలేకుండా సంచరించిన ఈ అధముణ్ణి క్షమించి మాఇద్దర్నీ దీవించవూ?"

ఆవిడకు హృదయంపొంగింది.

"నాయనా! ఈదేవకన్నె నా నాకోడలు? బొమ్మలాటవాళ్ల పిల్లంటే యీనాదుల అమ్మాయిలా ఉంటుందనుకున్నాను. ఈమె శాపంచేతపుట్టిన ఇంద్రుడి కూతురురా."

కామేశ్వరరావు, మీనాక్షీ ఆమెపాదాలకడ మోకరిల్లారు. ఆతల్లి కొడుకూ,కోడళ్ల తలలమీద రెండుచేతులూ ఉంచి తలయెత్తి, "శ్రీరాములూ, వీళ్లిద్దర్నీ రక్షించు!" అన్నది.